క్లుప్తంగా

ప్రజలకు అందుబాటులో గ్రంథాలయం



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న జిల్లా కార్యదర్శి బుగ్గారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శంకరయ్య

సాక్షి ఎఫెక్ట్

ముస్తాబాద్: ముస్తాబాద్‌లోని శాఖ గ్రంథాలయాన్ని ప్రజలందరికీ ఉపయోగపడేలా మరో చోటికి తరలిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డి అన్నారు. సాక్షిలో ఈనెల 12న 'గ్రంథాలయ నిర్మాణానికి గ్రహణం' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందిస్తూ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, జిల్లా కార్యదర్శి బుగ్గారెడ్డి గురువారం ముస్తాబాద్‌లోని గ్రంథాలయాన్ని పరిశీలించి మాట్లాడారు. పోతుగల్ దారిలో అద్దె భవనంలో సాగుతున్న భవనాన్ని తాత్కాలికంగా జనసమర్థం ఉన్న ప్రాంతానికి తక్షణమే తరలించాలని ఆదేశించారు. అలాగే శాశ్వత భవన నిర్మాణానికి పంచాయతీ నాలుగు గుంటల స్థలాన్ని కేటాయించిందని, నిధులు విడుదల కాకపోవడంతో పనులు మొదలుపెట్టలేదన్నారు. త్వరలోనే ఆర్థిక శాఖ క్లియరెన్స్ రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. జిల్లా గ్రంథాలయ ఇన్‌చార్జి శంకరయ్య ఉన్నారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న వికాస్–దీప

కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ఫౌండేషన్ బాధ్యులు చెన్నమనేని వికాస్‌రావు–డాక్టర్ దీప గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. స్వచ్ఛమైన నీరు లభించకనే అనేక రకాల వ్యాధులు వస్తున్నాయన్నారు. వ్యాధుల నుంచి ప్రజలను కాపాడేందుకే గ్రామాల్లో ప్యూరిఫైడ్ వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. యువకులకు స్కిల్ డెవలప్‌మెంట్ కోసం నాగారంలో వృత్తి విద్యా శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భారతి, రెడ్డి సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు దొడ్డ రాజిరెడ్డి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ భూంరెడ్డి, మాజీ సర్పంచ్ బాపురెడ్డి, నాయకులు బెంద్రం శ్రీనివాస్‌రెడ్డి, పోగుల లచ్చిరెడ్డి, మిర్యాల్‌కార్ బాలాజీ, ఒగ్గు ప్రభాకర్, ఎల్ల రాంరెడ్డి, బాలకిషన్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడాపోటీలు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి రాజీవ్‌నగర్‌లోని మినీ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సిరిసిల్ల మండల స్థాయి క్రీడా పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఇట్టి పోటీలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దేవత ప్రభాకర్ ప్రారంభించారు. దాదాపు 20 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల చెందిన 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బాలురకు కబడ్డీ, వాలీబాల్, ఖో–ఖో పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ జోగినిపల్లి రవిందర్‌రావు, పెటా టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాన బాబు, ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు బి.మధన్, కార్యదర్శి రాజేశ్‌తో పాటు పీఈటీ, ఎస్‌కే మోహినోద్దీన్, కె.రజిత, బాబు, జగన్‌మోహన్, నవీన్, బాలాజీ, మహేందర్ పాల్గొన్నారు.

నిరసనల హోరు.. నినాదాల జోరు



జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీల మహార్యాలీ



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

- ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల ధర్నాలు, ర్యాలీలు
- ప్రభుత్వ తీరుపై అంగన్‌వాడీ, సమగ్ర ఉద్యోగుల నిరసన

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం సిరిసిల్ల గురువారం నిరసనలు.. నినాదాలతో హోరెత్తింది. అంగన్‌వాడీ కార్యకర్తలు, సమగ్ర శిక్ష ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ వరుస ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీలు నిర్వహించారు. ఉద్యోగుల దీక్షలకు కాంగ్రెస్ తదితర పార్టీల నేతలు సంఘీభావం తెలిపారు.

రోడ్డెక్కిన అంగన్‌వాడీలు..

జిల్లా కేంద్రం సిరిసిల్లలో అంగన్‌వాడీ కార్యకర్తలు రోడ్డెక్కారు. నాలుగు రోజులుగా తమ డిమాండ్ల సాధనకై నిరవధిక సమ్మెలో భాగంగా రిలేదీక్షలు చేపడుతున్నారు. ప్రభుత్వం ఏలాంటి స్పందన లేకపోవడంతో గురువారం పట్టణంలో వందలాది ఐసీడీఎస్ కార్యకర్తలు ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ ర్యాలీ చేపట్టారు. జిల్లా అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు కల్లూరి చందన, ప్రధాన కార్యదర్శి ఎదురుగట్ల మమత, ఉపాధ్యక్షురాలు కల్వకుంట్ల పద్మ, తదితరులు పాల్గొన్నారు.

దీక్షలకు కాంగ్రెస్ మద్దతు

ఆర్డీవో ఆఫీసు వద్ద నిరవధిక దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీలకు డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పార్టీ నేతలతో సహ సంఘీభావం తెలిపి మాట్లాడారు. శుక్రవారం సిరిసిల్లకు వస్తున్న మంత్రి కేటీఆర్ అంగన్‌వాడీల వద్దకు వచ్చి చర్చలు జరిపి వారి న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ పర్యటన సందర్భంగా అంగన్‌వాడీలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని హెచ్చరించారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే సమస్యలను పార్టీ ఖచ్చితంగా పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు సీనియర్ నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, సంగీతం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ప్రకాశ్, దేవరాజు పాల్గొన్నారు.



ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ బొమ్మలతో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

సమగ్ర శిక్ష ఉద్యోగుల వినూత్న నిరసన

తమ ఉద్యోగాలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో వినూత్న తరహాలో నిరసనలు హోరెత్తించారు. వారు తయారు చేసిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ బొమ్మలతో రోడ్డుపై ప్రదర్శన జరిపి ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. పనికి సమాన వేతనాలివ్వాలని, మహిళ ఉద్యోగులకు మెటర్నిటీ లీవులను అమలు చేయాలని, సమగ్ర శిక్షలో అసువులు బాసిన ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ సమస్యలపై నిర్లక్ష్యం వహించడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ నాయకులు తుమ్మ రాజేందర్, అబ్దుల్ కయ్యూం, కత్తి జయలక్ష్మి, చిప్ప నవీన్, నీరజ, శ్రీనివాస్, సలీం, నరేష్, వెంకటస్వామి, ఉపేందర్ పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి అక్రమ అరెస్టుపై నిరసన



అంబేద్కర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు



తంగళ్లపల్లిలో కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

సిరిసిల్లటౌన్/వేములవాడ/వేములవాడఅర్బన్/తంగళ్లపల్లి/ముస్తాబాద్/వీర్నపల్లి/గంభీరావుపేట/కోనరావుపేట: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేపట్టిన నిరుద్యోగ దీక్షను భగ్నం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ పార్టీ నాయకులు జిల్లా వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ, కేసీఆర్ దిష్టిబొమ్మలు దహనం చేశారు. నిరసన ప్రదర్శనల్లో బీజేపీ నాయకుడు చెన్నమనేని వికాస్ రావు, రాష్ట్ర, జిల్లా నాయకులు ఎనగంటి నరేశ్, కొండ నరేశ్, గాజుల వేణు, తాటిపల్లి శ్రీనివాస్, గుడ్ల విష్ణు, సదానందం, సంగీతం సాయిరాం వేములవాడ పట్టణ శాఖ అధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు, పార్టీ మండల అధ్యక్షులు చింతపల్లి వెంకటేశ్వరరావు, గునుగుల దేవేందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి బుర్ర శేఖర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు కోల ఆంజనేయులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కృతజ్ఞతా ర్యాలీ, సభకు కదలిరండి

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాకు మెడికల్ కాలేజీని మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు, మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞత తెలిపే ర్యాలీలో నర్సింగ్ కాలేజీ విద్యార్థులు భాగస్వాములు కావాలని టీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకులు జక్కుల నాగరాజు యాదవ్ పిలుపునిచ్చారు. నర్సింగ్ కాలేజీలో గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు మెడికల్ కాలేజీ ఎంతో దోహపడుతుందన్నారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్, నాయకులు కొత్త సంతోష్, షేక్ సికిందర్, సయ్యద్ ఆఫ్రోజ్, చీమల ప్రశాంత్ యాదవ్, కాసర్ల పవన్, మహేశుని శ్రీకాంత్, నర్సింగ్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండల పరిషత్‌లో ఎంపీపీ శరత్‌రావు విలేకరులతో మాట్లాడుతూ సీఎం కృతజ్ఞత సభను విజయవంతం చేయాలన్నారు. సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, సర్పంచ్ గౌతంరావు, కోఆప్షన్ సభ్యుడు షాదుల్, నర్సింలు, మల్లేశం, నవీన్ పాల్గొన్నారు.

బోయినపల్లి: మెడికల్ కళాశాల ప్రారంభోత్సవం సందర్భంగా కృతజ్ఞతా ఊరేగింపులో బీఆర్‌ఎస్ నాయకులు ఉత్సాహంగా పాల్గొనాలని రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్‌రావు, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, వైస్‌ఎంపీపీ నాగయ్య పాల్గొన్నారు.



సిరిసిల్ల నర్సింగ్ కాలేజీలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీఆర్‌ఎస్‌వీ నాయకులు, విద్యార్థులు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఊరడి ప్రవీన్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహిం కృతజ్ఞత సభకు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.

తంగళ్లపల్లి: సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞత సభ సందర్భంగా మండల కేంద్రంలో బైక్ ర్యాలీలో పాల్గొనాలని ఎంపీపీ పడిగెల మానస, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ సింగిరెడ్డి రవీందర్ రెడ్డి, ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పెద్దూరి తిరుపతి, సింగిల్‌విండ్ వైస్‌చైర్మన్ వెంకట రమణా రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాం పరిశీలన

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని జయవరం గ్రామం వద్ద మూలవాగుపై నిర్మించిన చెక్‌డ్యాంను ఇరిగేషన్ శాఖ అధికారులు సత్యప్రకాశ్, శ్రీనివాస్ పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెక్‌డ్యాం సైడ్‌వాల్స్ పూర్తిగా దెబ్బతిని రైతుల పొలాలు కొట్టుకుపోయాయి. ప్రభుత్వానికి నివేదిక అందజేస్తున్నట్లు తెలిపారు.

అమరుల విగ్రహాలు పెట్టించాలి

సిరిసిల్లటౌన్: నిజాం నిరంకుశత్వంపై పోరాడిన తెలంగాణ సాయుధపోరాట వీరుల చరిత్రను భావి తరాలకు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సిరిసిల్లలోని కార్మిక భవనంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. సాయుధ పోరాటంలో అమరులైన రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డిల చరిత్రలను పాఠ్యాంశాల్లో చేర్చాలని, వారి కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. సెప్టెంబర్ 17న హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండులో ముగింపు సభకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. నాయకులు రవి, రమేశ్, సోమ నాగరాజు పాల్గొన్నారు.

పోరాటయోధుడు పుల్లయ్య

వేములవాడ: వేములవాడ పట్టణానికి చెందిన గుమ్మి పుల్లయ్య బ్రాహ్మణ కుటుంబంలో పుట్టినప్పటికీ భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసిన యోధులని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. పట్టణంలోని గుమ్మి పుల్లయ్య స్మారక చిహ్నం వద్ద గురువారం నివాళి అర్పించి, ఆయన కార్మికులకు చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

వేములవాడ నుంచి కడారి రాములు పోటీ

వేములవాడ అసెంబ్లీ స్థానం నుంచి కడారి రాములును పోటీలో ఉంచుతున్నట్లు గుంటి వేణు గురువారం ప్రకటించారు.

అర్హులకే డబుల్ బెడ్రూం ఇళ్లు

ఇల్లంతకుంట: ఇల్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయిస్తామని జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు అన్నారు. మండలంలోని పాత్తూరు గ్రామంలో డబుల్ బెడ్రూం ఇళ్లను గురువారం పరిశీలించి మాట్లాడారు. డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేయని గ్రామాల్లో కూడా గృహలక్ష్మి పథకం ద్వారా ఇంటి స్థలం ఉన్న వారందరికి రూ.3 లక్షల సాయం అందిస్తామన్నారు. శుక్రవారం పాత్తూరు గ్రామంలో డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. సర్పంచ్ సిద్ధం శ్రీనివాస్, ఎంపీటీసీ పట్నం అశ్విని, ఉపసర్పంచ్ పర్శరాం, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు చేయాలని నిరసన

ఇల్లంతకుంట: స్థానిక బస్టాండ్ నుంచి ముస్కానీపేట వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలు ఏర్పడి వాహనాలు వెళ్లరాకుండా మారిందని, రోడ్డు నిర్మాణం చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదంటూ మండల యువజన సంఘాల అధ్యక్షుడు బెంద్రం తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బెంద్రం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ వర్షం పడినప్పుడల్లా రోడ్డుపై ఉన్న గుంతల్లో మోకాళ్ల లోతు నీరు నిలిచి వాహనాలతో పాటు, జనాలు కనీసం నడిచేందుకు కూడా వీలు లేకుండా పోయిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి రోడ్డు నిర్మాణం చేయించాలన్నారు.

ప్రజలకు చేరువలో వైద్యం ప్రభుత్వ ధ్యేయం

- వేములవాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు



మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడ: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు, ఉన్నత విద్య అందించాలన్నదే సీఎం కేసీఆర్ ధ్యేయమని వేములవాడ అసెంబ్లీ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. సీఎం కేసీఆర్ వర్చువల్‌గా, మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శుక్రవారం సిరిసిల్లలో ప్రారంభించబోయే మెడికల్ కళాశాల ప్రారంభోత్సవానికి పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. పట్టణంలోని మల్లారం జంక్షన్ వద్ద పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాకముందు రాష్ట్రంలో 5 మెడికల్ కళాశాలలు, 850 సీట్లు ఉంటే తెలంగాణ సాధించిన తరువాత పదేళ్లలో 27 కొత్త మెడికల్ కళాశాలలు, కేంద్ర ప్రభుత్వ ఈఎస్ఐ ఆసుపత్రి, ఇతర రాష్ట్రాలతో కలిపి మొత్తం 3,840 సీట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల అనుమతిచ్చిన మెడికల్ కళాశాలల్లో 43 శాతం తెలంగాణ రాష్ట్రానివే కావడం తమకు గర్వకారణమన్నారు. ప్రయివేటు కళాశాలల్లోను 85 శాతం కన్వీనర్ కోటా సీట్లు తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకే కేటాయించడం సువర్ణావకాశమన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, జెడ్పీ మాజీచైర్మన్ తీగల రవీందర్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ మిర్యాల ప్రభాకర్‌రావు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

వేములవాడరూరల్: వేములవాడ పట్టణంలోని 3వ వార్డు లక్ష్మీపురం పెద్దమ్మల కాలనీలో పలువురు డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న యువజన సంఘం భవనం వద్ద మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చిత్రపటానికి యువకులు, బీఆర్‌ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ఇల్లంతకుంట: కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని వంతడుపుల గ్రామానికి చెందిన పినికాశి శంకర్‌కు రూ.19 వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి అందజేశారు.

రుద్రంగి: మండల కేంద్రంలో గురువారం ఐదుగురు లబ్ధిదారులకు సుమారు రూ.లక్ష విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్, ప్రజాప్రతినిధులు, నాయకులు పంపిణీ చేశారు.

తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన చౌటపల్లి రాజేశ్‌కు రూ.27 వేలు, అశోక్‌కు రూ.24 వేలు, పద్మకు రూ.22 వేల విలువైన సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులను సర్పంచ్ బైరి శ్రీవాణి గురువారం అందజేశారు.

గంభీరావుపేట: మండలంలోని కోళ్లమద్ది గ్రామంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సెస్ డైరెక్టర్ గొరినేని నారాయణరావు గురువారం పంపిణీ చేశారు.

హైలెవల్ వంతెన నిర్మాణం త్వరగా చేపట్టాలి

గంభీరావుపేట: మండల కేంద్రమైన గంభీరావుపేట–లింగన్నపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణం త్వరగా చేపట్టాలని బీఎస్పీ మండల శాఖ అధ్యక్షుడు కర్రొల్ల రాజు డిమాండ్ చేశారు.

అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి

ఇల్లంతకుంట: మండలంలోని వల్లంపట్ల గ్రామంలో గ్రామపంచాయతీలో ఎలాంటి తీర్మానం చేయకుండానే అనర్హులను లబ్ధిదారులుగా ఎంపిక చేశారని వల్లంపట్ల వార్డు సభ్యులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

యాదవ సంఘం కమిటీకి సన్మానం

ముస్తాబాద్: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ యాదవ సంఘం నూతన కమిటీని గురువారం సన్మానించారు.

ఓజోన్ పరిరక్షణతోనే మానవజాతికి జీవం

సంక్షిప్త వార్తలు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల లో ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా ముందస్తుగా విద్యార్థులు రంగోళీ పోటీలు గురువారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

తంగళ్లపల్లి: మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన గాజంగి కీర్తి, బండి ఉపేందర్, కూతురు కరుణాకర్‌రెడ్డి, నీలి శ్రీనివాస్‌ను గురువారం ఓబులాపూర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ నర్సయ్య సన్మానించారు.

కరపత్రాల ఆవిష్కరణ

వీర్నపల్లి: మండల కేంద్రంలో సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల కరపత్రాలను సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లారపు అరుణ్‌కుమార్ ఆవిష్కరించారు.

ధర్నాలకు టెంట్లు సమకూర్చొద్దు

బోయినపల్లి: మండలంలో అనుమతులు లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు తదితర ఆందోళనలు చేపట్టే వారికి టెంట్‌హౌస్ యజమానులు తమ సామాగ్రి సమకూర్చవద్దని ఎస్సై మహేందర్ అన్నారు.

గొర్రెల పంపిణీ

ముస్తాబాద్: ఎల్లారెడ్డిపేట మండలం అగ్రహారంలో గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు గురువారం ప్రారంభించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ముస్తాబాద్: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పట్టుకున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. గొల్లపల్లికి చెందిన ట్రాక్టర్ యజమాని సతీశ్‌తో పాటు, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

స్వర్ణకారులు ఐక్యంగా ఉండాలి

ముస్తాబాద్: స్వర్ణకారులందరూ ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కరించుకోవచ్చని స్వర్ణకారుల సంఘం బాధ్యులు ఎర్రవెల్లి కృష్ణ, శ్రీగాధ ధర్మచారి, పాలోజీ సతీశ్ అన్నారు. ఎల్లారెడ్డిపేటలో గురువారం స్వర్ణకారుల సమావేశం నిర్వహించారు. మండలంలో పనిచేస్తున్న స్వర్ణకారులు ఈనెల 17న జరిగే విశ్వకర్మ మహాయజ్ఞంలో పాల్గొని, మండల కమిటీని ఎన్నుకోవాలన్నారు.

ఛలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద హలో మాల–ఛలో ఢిల్లీ మాలల పోరుగర్జనకు సంబంధించి పోస్టర్‌ను తెలంగాణ మాల మహానాడు నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లిలో గురువారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వృద్ధులు, దివ్యాంగులకు ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

బండితో గోలి భేటీ

వేములవాడ: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌తో వేములవాడ నాయకులు డాక్టర్ గోలి మోహన్ గురువారం కలుసుకున్నారు. ఇటీవల తన అనుచరులతో సమావేశం నిర్వహించిన అనంతరం బండి సంజయ్‌తో కలసి మంతనాలు జరపడం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది.

శిలాఫలకానికి క్షీరాభిషేకం

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో యువజన సంఘానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి ఐదేళ్లు కావస్తున్న ఇప్పటి వరకు యువజన సంఘ భవన నిర్మాణం పూర్తిచేయలేదంటూ ఇల్లంతకుంట యువకులు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన శిలాఫలకానికి క్షీరాభిషేకం చేశారు.

తెలంగాణ ఇచ్చిన సోనియా రుణం తీర్చుకుందాం

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



పార్టీ కండువా కప్పుతున్న కేకే మహేందర్‌రెడ్డి

గంభీరావుపేట: తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన తల్లి సోనియాగాంధీ రుణం తీర్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గురువారం పార్టీ జెండా పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి, గంభీరావుపేటకు చెందిన యువకులు, మహిళలు పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు 11, 12 ప్యాకేజీలు పూర్తయినా, 9వ ప్యాకేజీ పనులు ఎందుకు పూర్తికాలేదో కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు హమీద్, ఎంపీటీసీ పర్శరాములు, నాయకులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు ఇన్సూరెన్స్ కార్డులు

ముస్తాబాద్: ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆటో, కారు డ్రైవర్లకు ఇన్సూరెన్స్ డబ్బులను వ్యక్తిగతంగా చెల్లించి, గురువారం కార్డులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, దొమ్మాటి నర్సయ్య, కేకేసీ ప్రధాన కార్యదర్శి సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

ఇల్లంతకుంట: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాజకీయ పార్టీల నాయకులు సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు అనుచిత వ్యాఖ్యలు చేసుకుని, సమస్యలు సృష్టించొద్దని సూచించారు. తహసీల్దార్ జావెద్ అహ్మద్, ఎస్సై సుధాకర్ పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలి

సిరిసిల్లఅర్బన్: ఉపాధ్యాయ ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులు షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్, చెర్లపల్లి సత్యం గౌడ్, ప్రధాన కార్యదర్శి గడ్డం శంకర్ పాల్గొన్నారు.

సభను బహిష్కరించాలి

సిరిసిల్లఅర్బన్: జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించే మంత్రి కేటీఆర్ బీఆర్‌ఎస్ సభను బహిష్కరించాలని జిల్లా ముదిరాజ్ సంఘం కోర్ కమిటీ సభ్యుడు పిట్టల భూమేశ్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. అధిక జనాభా ఉన్న పద్మశాలీలకు టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం పోచెట్టిపల్లి శివారులో గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని విఠోబా(55) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ మారుతి తెలిపిన వివరాలు. సోలాపూర్‌కు చెందిన విఠోబా తన కుటుంబంతో నాలుగేళ్లుగా సిరిసిల్లలో ఉంటున్నాడు. వేములవాడ ప్రాంతానికి వచ్చిన ఆయన మద్యం సేవించి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా హిందీ దివస్

సిరిసిల్లఅర్బన్/తంగళ్లపల్లి/గంభీరావుపేట/రుద్రంగి: హిందీ భాషా దినోత్సవాన్ని జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హిందీ అక్షరాలతో చిత్రపటాలు గీసి నృత్యాలు చేశారు. హిందీ భాషా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. భాషా ఉపాధ్యాయులను సన్మానించారు. విద్యార్థులకు పుస్తకాలు, డిక్షనరీలను పంపిణీ చేశారు.